epaper.samayamdaily.net
APTEL/26/A3949
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక
STV SAMAYAM

సమయం
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 61 | ఎడిటర్ : అలీ ముర్తుజా | బుధవారం 2 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



## జీడీపీ వృద్ధిరేటు గణాంకాల గారడీ

- ధరలు మోత మోగిస్తుంటే.. వృద్ధి ఎలా సాధ్యం
- ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్

4

## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

- దేశప్రజల సమిష్టి కృషితోనే జీడీపీ వృద్ధిరేటు
- 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు

2

భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు.



## ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్



## మత్స్యకారులతో సీఎం ముఖాముఖి!

- వారి జీవన విధానంపై ఆసక్తిగా ఆరా
- వేట నిషేధ భృతిపై లబ్ధిదారుల హర్షం
- నేరుగా పెన్షన్లు అందజేసిన చంద్రబాబు

2వ పేజీలో..



### సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే
# సర్కారు మంత్రం

**బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు**

- పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యం!
- స్థానిక ఎన్నికలు అడ్డుకునేందుకు గొడ్డలి పార్టీ కుట్ర
- నర్సాపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకొస్తున్నామని, ఓటమి భయంతోనే ప్రతిపక్షం స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునే కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. - నర్సాపురం (సమయం న్యూస్):

2లో

### వచ్చే ఏడాదికి 100%
## అక్షరాస్యత!

- సత్ఫలితాలిస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమం
- బడి బయట పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి
- విద్యాశాఖల సమీక్షలో మంత్రి నారా లోకేశ్ ఆదేశం

2



## ఎంఎస్ఎంఈలతోనే 2047 లక్ష్యాలు



- ఏపీలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం
- స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్
- ఎస్ఐపీసీ భేటీలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

3



- బాధిత కుటుంబాలకు పరిహారం
- విద్యార్థులపై కేసుల ఎత్తివేత
- సుప్రీంలో కేంద్రం హామీ!
- నీట్ ఆందోళనకారులకు ఊరటం

3

## ఢిల్లీ మార్చ్ రద్దు!

సీజేపీ నిరసన వెనక్కి..

## పండుగలా పింఛన్ల పంపిణీ!



ఇంటింటికీ వెళ్లి అందజేసిన మంత్రి నారాయణ
అవ్వాతాతల మోములో వెల్లివిరిసిన ఆనందం

3



## నేతన్నలకు ఆప్కో భరోసా!

- సకాలంలో వస్త్రాల కొనుగోలు బిల్లుల చెల్లింపు
- 24 నెలల్లో 24.51 కోట్ల బకాయిలు జమ
- వెల్లడించిన మంత్రి సవిత

3

## ఓటర్ల జాబితా సవరణ గడువు పెంపు!

- సెప్టెంబర్ 10 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలకు అవకాశం
- అక్టోబర్ 5 నాటికి దరఖాస్తుల పరిష్కారం
- అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

2



## చంద్రబాబు ద్రోహానికి ప్రతిరూపం!

- వెన్నుపోటు రాజకీయాలకు 31 ఏళ్లు
- ఎన్టీఆర్ ఫొటోతో వాడుకునే నైతిక హక్కు లేదు
- వైఎస్సార్సీపీ నేత లక్ష్మీపార్వతి



రాజకీయాల్లో ద్రోహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేరాఫ్ అడ్రస్‌గా మారారని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి తీవ్ర స్థాయిలో విమర్శించారు. నాడు ఎన్టీఆర్‌పై ప్రయోగించిన కుట్రలనే నేడు జగన్‌పైనా అమలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. 31 ఏళ్ల క్రితం సరిగ్గా సెప్టెంబర్ 1న మహానాయకుడు ఎన్టీ రామారావును అధికారానికి దూరం చేసి చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠం ఎక్కారని నందమూరి లక్ష్మీపార్వతి గుర్తుచేశారు.

3

## విజయసాయిపై చెయ్యి చేసుకున్న సజ్జల!

- మంగళగిరి ప్లీనరీలో ఘోర అవమానం
- ఇరువురి మధ్యా తీవ్ర స్థాయిలో వాగ్వాదం
- మతాల మధ్య చిచ్చుపెడుతున్న వైసీపీ
- రాష్ట్రంలో అస్థిరత కోసం ఫేక్ వీడియోలతో కుట్ర
- వైసీపీపై విరుచుకుపడ్డ కోటంరెడ్డి

2





# మత్స్యకారులతో సీఎం ముఖాముఖి!

**వారి జీవన విధానంపై ఆసక్తిగా ఆరా**

**వేట నిషేధ భృతిపై లబ్ధిదారుల హర్షం**

**నేరుగా పెన్షన్లు అందజేసిన చంద్రబాబు**

**నర్సాపురం (సమయం న్యూస్):** పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం పర్యటించారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా మత్స్యకారుల కుటుంబాలకు ఆయన స్వయంగా పెన్షన్లు పంపిణీ చేశారు. ముందుగా ఫెర్రీ పాయింట్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి.. పడవల వద్ద కూర్చున్న మత్స్యకారులతో ముచ్చటించారు. తిరుమణి స్వామి అనే మత్స్యకారుడికి తన చేతుల మీదుగా పెన్షన్ అందజేశారు. వారి కుటుంబాల యోగక్షేమాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. మత్స్యకారులు గల్లంతవుతున్న ఘటనలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల 20 రోజుల పాటు సముద్రంలో తప్పిపోయిన కోనసీమ మత్స్యకారులను కోస్ట్ గార్డ్, నేవీ, కేంద్ర మెరైన్ విభాగాల సహకారంతో సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. మత్స్యకారుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని భరోసా కల్పించారు. వేట నిషేధ సమయంలో ఇస్తున్న రూ.20 వేల సాయం తమను ఎంతో ఆదుకుంటోందని ఈ సందర్భంగా మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు. ఒక మత్స్యకారుడి ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు పడవలోకి ఎక్కి వారితో కలిసి కాసేపు నీటిపై ప్రయాణించారు. వేటకు వెళ్లినప్పుడు దినచర్య ఎలా ఉంటుంది, ఎన్ని గంటలు సముద్రంలో గడుపుతారు, భోజన సదుపాయాలు ఎలా సర్దుబాటు చేసుకుంటారు వంటి అనేక విషయాలను ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు.

# ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

**మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్**

**అమరావతి,సెప్టెంబర్1:** ఆంధ్రప్రదేశ్ మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. రాష్ట్రంలో త్వరలో పెద్ద ఎత్తున అందుబాటులోకి రానున్న ఏసీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. మొగల్తూరులో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పింఛన్ల రూపంలోనే ప్రజలకు రూ. 73,000 కోట్లు అందించినట్లు గుర్తుచేశారు. మహిళలు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారి కష్టాలను తీర్చేందుకే 'దీపం' పథకాన్ని తీసుకువచ్చామని వివరించారు. ఇదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఏకంగా 350 కేసులు వేశారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో అభివృద్ధిని ఆపలేరని హితవు పలికారు. కేవలం ప్రజల ప్రయోజనాల కోసమే కూటమి పార్టీలు ఏకమయ్యాయని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ముందుకు సాగుతోందని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో వద్ద వానరాల సందడి

**ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన సిఎం చంద్రబాబు**

**అమరావతి,సెప్టెంబర్1:** వెలిగొండ ప్రాజెక్ట్ నీటి ప్రవాహంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా 'ఎక్స్'లో ఆసక్తికర పోస్ట్ చేశారు. వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీటిని వానరాలు తాగుతూ దాహం తీర్చుకుంటున్న దృశ్యాన్ని సీఎం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. 'జలంతోనే.. జీవం, జీవితం' అంటూ ఈ వీడియోకు స్పందించారు. వెలిగొండ జలాలు కరవు ప్రాంతాలకు చేరడంతో ప్రజల తాగునీటి అవసరాలతో పాటు మూగజీవాలకు కూడా దాహార్తిని తీర్చడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1ను సీఎం చంద్రబాబు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. మార్కాపురం జిల్లా గంటవానిపల్లి సమీపంలో వెలిగొండ ఫీడల్ కెనాల్ వద్ద కృష్ణమ్మకు చీర, సారెను సమర్పించిన సీఎం... జలహారతి ఇచ్చారు. అనంతరం ప్రాజెక్ట్ పైలాన్‌ను ఆవిష్కరించారు. స్థానిక రైతులతో బటన్ నొక్కించి నల్లమలసాగర్‌కు నీటిని విడుదల చేశారు. ఈ ప్రాజెక్ట్‌తో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలోని కరవు ప్రాంతాలకు కొత్త జీవం రానుంది. ఫేజ్-1 ద్వారా సుమారు 1.19 లక్షల ఎకరాల సాగునీరు, 4 లక్షల జనాభాకు తాగునీటిని అందించనున్నారు.

# 'తల్లికి వందనం' నిధుల విడుదలకు సిద్ధం

**అమరావతి,సెప్టెంబర్1:** ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం కింద డబ్బులు పడకుండా ఎదురుచూస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. మరో మూడు రోజుల్లో అర్హులైన మిగిలిన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నిధులను జమ చేయనున్నట్లు వెల్లడించింది. ముఖ్యంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందనుంది. వాస్తవానికి ఈ నిధులను ఆగస్టు 30వ తేదీనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా, కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పునఃసమీక్షించారు.

# సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే సర్కారు మంత్రం

- పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యం!
- బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు
- స్థానిక ఎన్నికలు అడ్డుకునేందుకు గొడ్డలి పార్టీ కుట్ర
- నర్సాపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**నర్సాపురం (సమయం న్యూస్):** పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 31 ఏళ్ల క్రితం సెప్టెంబరు 1న ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశానని ఆయన గుర్తుచేశారు. పేదలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచిన పెన్షన్లు అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 73,507 కోట్లను పెన్షన్ల రూపంలో అందించామని, రెండేళ్లలో సంక్షేమ కార్యక్రమాల కోసం 1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. గతంలో డ్వాక్రా సంఘాలతో పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టి మహిళా సాధికారతకు బాటలు వేశామని సీఎం అన్నారు. దీపం-2 పథకం ద్వారా ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, స్త్రీశక్తి ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. గతేడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, వారు తయారు చేసిన ఉత్పత్తులకు స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో 20 వేల ఆర్థిక సాయం, చేనేతలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అమలుతో పాటు గిరిజన విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఐఐటీ, ఐఐఎం వంటి సంస్థలకు పంపిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో లాగా బటన్ నొక్కడం కాకుండా ఇంటింటికీ వచ్చి పెన్షన్ ఇస్తున్నామని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పీ4 మోడల్ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరువు నేలకు కృష్ణా జలాలు అందించి శ్రీశైలం నుంచి మార్కాపురం వరకు నీరు పారించామని చెప్పారు. త్వరలోనే గోదావరి నీటిని ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు తరలించబోతున్నామని, తొలుత అనకాపల్లికి, వచ్చే ఏడాది విశాఖకు, ఆ తర్వాత వంశధారకు చేరేలా చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.

**సాంకేతికతతో పౌర సేవలు**

గత పాలకులు పరిశ్రమలను తరిమేసి యువత భవిష్యత్తును దెబ్బతీశారని సీఎం విమర్శించారు. ఇప్పుడు రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకొస్తున్నామని, విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను 1.50 రూపాయలకే అందిస్తున్నామని చెప్పారు. పాలనలో ఏఐ ట్యూటర్, ఏఐ డాక్టర్ వంటి వ్యవస్థలతో పాటు 1.60 కోట్ల కుటుంబాలకు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ సేవలు అందించేలా ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. పీఎం సూర్యఘర్ కింద ప్రతి ఇంటిపై సౌర విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుపై దృష్టి పెట్టామన్నారు. నర్సాపురంలో ఆక్వా కల్చర్ యూనివర్సిటీ, డెల్టా మోడర్నైజేషన్ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమికి తిరుగులేదని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలు బలంగా ఉంటేనే గ్రామీణ అభివృద్ధి సాధ్యమని, అయితే ఎన్నికలు జరగకుండా అడ్డుకునేందుకు గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఓటమి భయంతోనే ఏకగ్రీవాలను వద్దంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను సైతం తగ్గించిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉపసభాపతి రఘురామ కృష్ణం రాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఏడాదికి వంద శాతం అక్షరాస్యత!

- సత్ఫలితాలిస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమం
- బడి బయట పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి
- విద్యాశాఖల సమీక్షలో మంత్రి నారా లోకేశ్ ఆదేశం



**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో అక్షర ఆంధ్ర కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని, వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి నూరు శాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా అడుగులు వేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత ఏడాది కాలంలో 25 లక్షల మంది అక్షరాస్యులుగా మారారని, అక్షరాస్యత 82.1 శాతానికి చేరిందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ ప్రయాణంలో శాసనసభ్యులను, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి ప్రజలను చైతన్యవంతం చేయాలని మంత్రి సూచించారు.

ఇంటర్మీడియట్ లో ఈ ఏడాది అడ్మిషన్లు పది వేల వరకు పెరగడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు అపార్ ఐడీ అనుసంధానం నూరు శాతం పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో బడి బయట ఉన్న లక్షా అరవై నాలుగు వేల మందికి పైగా చిన్నారులను వెంటనే పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు చొరవ చూపాలని స్పష్టం చేశారు. విద్యార్థులు వరుసగా మూడు రోజులు బడికి రాకపోతే వారి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడే బాధ్యతను స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీలకు అప్పగించాలన్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, దీనిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి లీప్ యాప్ ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని మంత్రి సూచించారు. ఉపాధ్యాయులకు ఏఐ టూల్స్ లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో ఒత్తిడి లేని చదువులపై దృష్టి సారించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 125 కేంద్రాల్లో ఆటిజం సెంటర్ల ఏర్పాటుకు సత్వరమే చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు.


# ఏపీలో ఓటర్ల జాబితా సవరణ గడువు పెంపు!

**సెప్టెంబర్ 10 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలకు అవకాశం**

**అక్టోబర్ 5 నాటికి దరఖాస్తుల పరిష్కారం**

**అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల**

**అమరావతి (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్స్, అభ్యంతరాల నమోదు గడువును కేంద్ర ఎన్నికల సంఘం సెప్టెంబర్ 10 వరకు పొడిగించింది. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను వెంటనే సరిచూసుకోవాలని అధికారులు సూచించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం గడువు పొడిగించింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అభ్యర్థన మేరకు షెడ్యూల్‌లో కీలక మార్పులు చేసింది. సవరించిన




షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలుకు సెప్టెంబర్ 10వ తేదీ వరకు అవకాశం కల్పించింది. జాబితాలో అర్హుల పేర్లు లేకపోయినా, వివరాల్లో ఏవైనా తప్పులున్నా ఈ గడువులోగా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. అందిన క్లెయిమ్స్, అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్టోబర్ 5వ తేదీ నాటికి పరిష్కరించనున్నారు. ఆ తర్వాత అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. సవరించిన షెడ్యూల్‌ను వెంటనే రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించాలని ఆదేశించింది. షెడ్యూల్‌లో చేసిన మార్పులపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారికి సూచించింది. ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని జాబితాలో తమ పేరు ఉందో లేదో కచ్చితంగా సరిచూసుకోవాలని అధికారులు కోరారు. పేరు, చిరునామా, ఇతర వివరాల్లో తప్పులుంటే నిర్ణీత గడువులోగా తగిన ఆధారాలతో దరఖాస్తు చేసి సరిదిద్దుకోవాలని స్పష్టం చేశారు.

# ఉత్తరాంధ్రకు గోదారమ్మ!

**ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి జలాలు**

**నేడు సీఎం చంద్రబాబు జల హారతి**

**2.87 లక్షల ఎకరాలకు సాగునీరు**



**అమరావతి (సమయం న్యూస్):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పించిన విధంగా గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు పరుగులు పెడుతున్నాయి. బుధవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువ ద్వారా వస్తున్న నీటికి సీఎం జల హారతి ఇచ్చి స్వాగతం పలకనున్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాల తరలింపు కల సాకారమైంది. బుధవారం మధ్యాహ్నం 2.20 గంటలకు పాయకరావుపేట చేరుకోనున్న సీఎం చంద్రబాబు.. కాలువపై ఉన్న రెగ్యులేటర్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. ఈ ఏడాదిలోనే అనకాపల్లికి గోదావరి నీళ్లు తీసుకెళ్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకున్నారు.

**కొండలు, నదులు దాటుకుంటూ..**

తూర్పు కనుమల్లో దారి చేసుకుంటూ పంపా, తాండవ, వరాహ, శారద నదులను దాటుకుంటూ ఈ జలాలు అనకాపల్లికి చేరుకోనున్నాయి. నదీ ప్రవాహాలకు అనుగుణంగా సైఫన్లు, అక్విడెక్టులను భారీ స్థాయిలో నిర్మించారు. ఎడమ కాలువ ద్వారా విడుదల చేస్తున్న నీటితో నాలుగు జిల్లాల్లోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 5.23 లక్షల మంది దాహార్తి తీరుతుంది. ఈ కాలువ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ 4,192 కోట్లు వెచ్చించింది.

**8 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యం**

సీఎం విడుదల చేసే జలాలతో అనకాపల్లి జిల్లాలోని 110 చెరువులు నిండనున్నాయి. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పారిశ్రామిక అవసరాలకు కూడా ఈ జలాలు ఉపయోగపడతాయి. వచ్చే ఏడాది నాటికి విశాఖ వరకు గోదావరి నీటిని తీసుకెళ్లేలా పనులు వేగవంతం చేశారు. ఆ తర్వాత ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానం చేసి ఏకంగా 8 లక్షల ఎకరాలకు సాగునీరు, ఆయా ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందించాలని ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

# విజయసాయిపై చెయ్యి చేసుకున్న సజ్జల!

- మంగళగిరి ప్లీనరీలో ఘోర అవమానం
- ఇరువురి మధ్యా తీవ్ర స్థాయిలో వాగ్వాదం
- మతాల మధ్య చిచ్చుపెడుతున్న వైసీపీ
- రాష్ట్రంలో అస్థిరత కోసం ఫేక్ వీడియోలతో కుట్ర
- వైసీపీపై విరుచుకుపడ్డ కోటంరెడ్డి

**నెల్లూరు (సమయం న్యూస్):** వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై ఆ పార్టీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి చెయ్యి చేసుకున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. మంగళగిరి ప్లీనరీలో వేదికపైనే వారి మధ్య వాగ్వాదం జరిగిందని, ఆ తర్వాత సజ్జల అత్యంత దారుణంగా దూషించారని ఆయన విమర్శించారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అంటే సజ్జల రామకృష్ణారెడ్డికి ఏమాత్రం పడదని, ఒకసారి చెయ్యి కూడా చేసుకున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళగిరిలో ప్లీనరీ జరుగుతున్నప్పుడు గెస్ట్ రూమ్‌లో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిందని, ఒకరినొకరు కొట్టుకున్న మాట వాస్తవమేనని ఆయన చెప్పారు. ఈ విషయం పార్టీలో చాలామంది నేతలకు తెలుసన్నారు. మంగళవారం నెల్లూరులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న కోటంరెడ్డి



మీడియాతో మాట్లాడుతూ.. తన ఎదుటే విజయసాయిరెడ్డికి ఘోర అవమానం జరిగిందని తెలిపారు. విజయసాయిరెడ్డి తన సొంత ఊరైన తాళ్లపూడికి వచ్చినప్పుడు కాకుపల్లి సెంటర్‌లో వంద వాహనాలతో తాను ఘన స్వాగతం పలికానని, ఆ విషయం తెలుసుకుని సజ్జల అత్యంత దారుణంగా బూతులు తిట్టారని కోటంరెడ్డి ఆరోపించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం దాటేంత వరకు అమరావతి రైతులకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటానని చెప్పినప్పుడు కూడా సజ్జల తనను తప్పుబట్టారని, అప్పుడే తాను ఆయన్ను తీవ్రంగా ఎదిరించి మాట్లాడానని గుర్తుచేశారు. ఆ కక్షతోనే విజయసాయిరెడ్డి తన ఊళ్లోనే మీటింగ్ పెట్టి తనను ఇష్టం వచ్చినట్లు తిట్టారని మండిపడ్డారు.

### మతాల మధ్య చిచ్చుపెడుతున్న వైసీపీ

గత ఐదేళ్లలో వైసీపీ ప్రజా వ్యతిరేక పాలన సాగించిందని, అందుకే ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయం పాలైందని కోటంరెడ్డి విమర్శించారు. అయితే ఎందుకు ఓడిపోయామనే ఆలోచన లేకుండా, మతాలు, కులాల మధ్య చిచ్చుపెడుతూ వైసీపీ వికృత రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. హిందూ మతానికి అన్యాయం జరిగిందని ఇప్పుడు మాట్లాడుతున్న నాయకులు, గతంలో ఆలయాల్లో రథాలు తగలబడినప్పుడు, విగ్రహాల తలలు నరికినప్పుడు, సింహాల విగ్రహాలు చోరీకి గురైనప్పుడు ఎందుకు నోరు మెదపలేదని నిలదీశారు. తిరుపతి వేంకటేశ్వరస్వామి పవిత్రతను దెబ్బతీసేలా రాజకీయాలకు వాడుకున్నారని ధ్వజమెత్తారు.

### మాజీ మంత్రి కోడలి ఆరోపణలపై ఏమంటారు?

మాజీ మంత్రిపై ఆయన కోడలు చేసిన సంచలన ఆరోపణలపై జగన్, వైసీపీ నేతలు ఎందుకు స్పందించడం లేదని కోటంరెడ్డి ప్రశ్నించారు. పెళ్లికి ముందు హిందువులమని చెప్పి, పెళ్లయ్యాక దేవుళ్లను పూజిస్తే మాజీ మంత్రి తనను కొట్టారని కోడలు ఆరోపిస్తే కనీసం నోరు మెదపలేదని విమర్శించారు. రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు రాకుండా అడ్డుకునేందుకు ఫేక్ వీడియోలతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతల మాటలు చూస్తుంటే.. నాగార్జున సాగర్, సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులు కట్టింది జగనే అన్నట్లుగా ఉంటుందని, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కూడా జగనే అంటారేమో అని కోటంరెడ్డి ఎద్దేవా చేశారు.

# ఎంఎస్ఎంఈలతోనే 2047 లక్ష్యాలు!

- ఏపీలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం
- స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్
- ఎస్ఐసీసీఐ భేటీలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి (సమయం న్యూస్):** ఎంఎస్ఎంఈల పటిష్టతతోనే 2047 లక్ష్యాలు సాధ్యమవుతాయని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. చెన్నైలో జరిగిన ఎస్ఐసీసీఐ 116వ వార్షిక సమావేశంలో పాల్గొన్న ఆయన.. స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ఎంఎస్ఎంఈల పటిష్టతతోనే 2047 లక్ష్యాలు సాధ్యమవుతాయని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. చెన్నైలోని హోటల్ లీలా ప్యాలెస్‌లో మంగళవారం దక్షిణ భారత వాణిజ్య, పారిశ్రామిక మండలి (ఎస్ఐసీసీఐ) 116వ వార్షిక సర్వసభ్య సమావేశం ఘనంగా



జరిగింది. దక్షిణ భారతదేశంలో వ్యాపార, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఈ సమావేశంలో లోతైన చర్చలు జరిపారు.

ఈ భేటీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పారిశ్రామిక వేత్తలను, యువతను ప్రోత్సహించడం ద్వారానే సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇందుకు ప్రభుత్వం, పారిశ్రామిక వర్గాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక పార్కులు, ఉమ్మడి వసతులు, ఆర్థిక సాయంతో ఏపీలో ఎంఎస్ఎంఈలకు ఎంతో అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు. ఇండియా-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, ఎన్నారై వర్గాల సహకారంతో స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. 2047 నాటి భారత వికాస లక్ష్యాలు చిన్న తరహా పరిశ్రమల ప్రగతిపైనే ఆధారపడి ఉన్నాయని ఎస్ఐసీసీఐ అధ్యక్షుడు అరుణ్ అలగప్పన్ వ్యాఖ్యానించారు. తమిళనాడు సాధించాలనుకుంటున్న ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రప్రదేశ్ నిర్దేశించుకున్న 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాల సాధనలో ఎంఎస్ఎంఈలే కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మద్రాస్, అన్నామలై, భారతిదాసన్ తదితర వర్సిటీల విద్యార్థులకు మంత్రి పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. సంస్థ సీనియర్ ఉపాధ్యక్షుడు వి.ఎన్.శివ శంకర్ ధన్యవాద సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

# పండుగలా పింఛన్ల పంపిణీ!

**ఇంటింటికీ వెళ్లి అందజేసిన మంత్రి నారాయణ**

**అవ్వాతాతల మోములో వెల్లివిరిసిన ఆనందం**

**ప్రజల సంక్షేమమే కూటమి సర్కారు లక్ష్యం**



**నెల్లూరు (సమయం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నెల్లూరులో పండుగ వాతావరణంలో జరిగింది. మంత్రి నారాయణ స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదును అందజేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అర్హులైన లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేస్తోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ తెలిపారు. మంగళవారం నెల్లూరు నగరంలోని 6వ డివిజన్ ఉడ్ హౌస్ సంఘంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందజేశారు. వారి యోగక్షేమాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. మంత్రి స్వయంగా తమ ఇంటి వద్దకు వచ్చి డబ్బులు ఇవ్వడంతో అవ్వాతాతలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక మహిళలు ఆయనకు మంగళహారతులు ఇచ్చి అభిమానం చాటుకున్నారు. ఒకే కుటుంబానికి పింఛన్, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ లాంటి పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీ రాగానే రాష్ట్రంలోని 62 లక్షల కుటుంబాలకు పింఛన్ల పంపిణీ ఒక పెద్ద పండుగలా మారిందని మంత్రి నారాయణ అన్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ మొత్తాన్ని రూ.2,000కు పెంచామని మంత్రి గుర్తుచేశారు. ఆ తర్వాత వచ్చిన సర్కారు ఆ మొత్తాన్ని రూ.3,000కు పెంచుతామని చెప్పి, ఏటా రూ.250 చొప్పున పెంచుతూ చివరి ఏడాదికి మాత్రమే ఆ మాట నిలబెట్టుకుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ప్రథమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, తదితర నేతలు పాల్గొన్నారు.

# నేతన్నలకు ఆప్కో భరోసా!

**సకాలంలో వస్త్రాల కొనుగోలు బిల్లుల చెల్లింపు**

**24 నెలల్లో 24.51 కోట్ల బకాయిలు జమ**

**వెల్లడించిన మంత్రి సవిత**

**అమరావతి (సమయం న్యూస్):** చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఆప్కో ద్వారా కొనుగోలు చేస్తున్న వస్త్రాలకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తూ నేతన్నల కుటుంబాలకు అండగా నిలుస్తోందని మంత్రి సవిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేనేత రంగం అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ చేనేత సహకార సంఘాలకు అండగా నిలుస్తోందని మంత్రి సవిత తెలిపారు.



గత ప్రభుత్వ హయాంలో ఆప్కో కొనుగోళ్లకు సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంతో చేనేత సంఘాలపై తీవ్ర ఆర్థిక భారం పడిందని ఆమె గుర్తుచేశారు. బకాయిలు నిలిచిపోవడంతో కార్మికుల కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఆ కష్టాలను పాదయాత్రలో తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్.. ఇచ్చిన మాట మేరకు అధికారంలోకి రాగానే తక్షణ చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకున్నారని ఆమె వివరించారు.

ప్రభుత్వ చొరవతో గత 24 నెలల కాలానికి సంబంధించి చేనేత సంఘాలకు 24.51 కోట్లను చెల్లించి వారిపై ఆర్థిక భారం తగ్గించారని మంత్రి వెల్లడించారు. తాజాగా మంత్రి ఆదేశాలతో రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, గురుకులాలకు సరఫరా చేసిన లివరీ వస్త్రాలకు సంబంధించి 20 చేనేత సహకార సంఘాల ఖాతాల్లో కోటి 3 లక్షల రూపాయలను జమ చేశారు. త్వరలోనే మిగిలిన బకాయిలను కూడా చెల్లించేలా అధికారులు వేగంగా చర్యలు చేపడుతున్నారు.

# చంద్రబాబు ద్రోహానికి ప్రతిరూపం!

**వెన్నుపోటు రాజకీయాలకు 31 ఏళ్లు**

**ఎన్టీఆర్ ఫొటో వాడుకునే నైతిక హక్కు లేదు**

**నాడు ఎన్టీఆర్‌పై, నేడు జగన్‌పై అవే కుట్రలు**

**వైఎస్సార్సీపీ నేత లక్ష్మీపార్వతి విమర్శలు**



**హైదరాబాద్ (సమయం న్యూస్):** రాజకీయాల్లో ద్రోహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేరాఫ్ అడ్రస్‌గా మారారని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి తీవ్ర స్థాయిలో విమర్శించారు. నాడు ఎన్టీఆర్‌పై ప్రయోగించిన కుట్రలనే నేడు జగన్‌పైనా అమలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. 31 ఏళ్ల క్రితం సరిగ్గా సెప్టెంబర్ 1న మహానాయకుడు ఎన్టీ రామారావును అధికారానికి దూరం చేసి చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠం ఎక్కారని నందమూరి లక్ష్మీపార్వతి గుర్తుచేశారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, మునసబు-కరణం వ్యవస్థను రద్దు చేసి ఎన్నో సంస్కరణలు తెచ్చిన ఎన్టీఆర్‌ను మోసం చేసిన చంద్రబాబుకు.. ఆయన ఫొటో పెట్టుకునే నైతిక హక్కు ఏమాత్రం లేదన్నారు. నాడు ఎన్టీఆర్‌ను ఒంటరి చేసేందుకు వాడిన రాజకీయ కుట్రలనే నేడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పైనా ప్రయోగిస్తున్నారని, జగన్ కుటుంబంలో విభేదాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఎన్నికల ముందు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం చంద్రబాబు నైజం అని లక్ష్మీపార్వతి ధ్వజమెత్తారు. భోగాపురం, వెలిగొండ లాంటి ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వాలు చేసిన పనులకు ఇప్పుడు ఆయన క్రెడిట్ తీసుకుంటూ తనను తాను విజనరీగా ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. మరోవైపు మంత్రి నారా లోకేశ్ స్టాన్‌ఫోర్డ్ విద్యపైనా ఆమె అనుమానాలు వ్యక్తం చేశారు. నిజాయితీ ఉంటే తన విద్యార్హత సర్టిఫికెట్‌ను బహిరంగంగా చూపించాలని సవాల్ విసిరారు.

# ఢిల్లీ మార్చ్ రద్దు!

**సీజేపీ నిరసన వెనక్కి**

**బాధిత కుటుంబాలకు పరిహారం**

**విద్యార్థులపై కేసుల ఎత్తివేత**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** నీట్-యూజీ పేపర్ లీక్ వివాదంపై సెప్టెంబర్ 5న తలపెట్టిన ఢిల్లీ మార్చ్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు సీజేపీ ప్రకటించింది. సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం సానుకూల హామీలు ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ తెలిపారు. ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు ఈ భారీ నిరసన యాత్ర జరగాల్సి ఉంది. ఈ కేసు విచారణలో కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో పలు కీలక హామీలు ఇచ్చారు. నీట్ వివాదంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం చెల్లిస్తామన్నారు. జులై 20 నుంచి 25 మధ్య నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్లను ఇక విచారించబోమని, కొత్త కేసులు అస్సలు పెట్టబోమని కోర్టుకు స్పష్టం చేశారు. గతంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటామని కేంద్రం భరోసా ఇవ్వడంతో సీజేపీ మార్చ్‌ను రద్దు చేసుకుంది. ఈ నిర్ణయాన్ని జస్టిస్ సూర్యకాంత్ మంచి పరిణామంగా అభివర్ణిస్తూ ప్రశంసించారు.

# పులి కోసం ముమ్మర గాలింపు!

**రంగంలోకి 350 మందికి పైగా సిబ్బంది**

**థర్మల్ డ్రోన్లు, నైట్ విజన్ కెమెరాలతో సెర్చ్ ఆపరేషన్**

**పోలవరం పరిసర గ్రామాల ప్రజలకు అధికారుల హెచ్చరికలు**



**ఏలూరు (సమయం న్యూస్):** ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, చింతూరు, పాపికొండ నేషనల్ పార్క్ పరిసరాల్లో సంచరిస్తున్న పులిని బంధించేందుకు అటవీ శాఖ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. సీసీఎఫ్ డాక్టర్ టి.జ్యోతి, ఏలూరు డీఎఫ్ఓ పి.వి.సందీప్ రెడ్డి పర్యవేక్షణలో ఎన్ఎస్టీఆర్, రాజమండ్రి రెస్క్యూ టీమ్‌లు రంగంలోకి దిగాయి. అటవీ సిబ్బంది, స్థానికులతో కలిపి సుమారు 350 మందికి పైగా రాత్రింబవళ్లు గాలిస్తున్నారు. పులి కదలికలను ట్రాక్ చేసేందుకు వాకీటాకీలు, వీహెచ్ఎఫ్ నెట్‌వర్క్, థర్మల్ డ్రోన్లు, నైట్ విజన్ కెమెరాలు, నెట్ ఫెన్సింగ్ లాంటి ఆధునిక సాంకేతికతను వాడుతున్నారు.

### ఒంటరిగా వెళ్లొద్దు..

పోలవరం ప్రాజెక్టు పరిసరాలతో పాటు రామయ్యపేట, చంద్రాన్న కాలనీ, ఇటికలకోట, నెత్తప్పకోట తదితర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మైక్ అనౌన్స్‌మెంట్లు, డప్పు చాటింపుల ద్వారా జాగ్రత్తలు సూచిస్తున్నారు. రైతులు, కూలీలు ఒంటరిగా కాకుండా గుంపులుగా మాత్రమే పనులకు వెళ్లాలని స్పష్టం చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బయట తిరగరాదని, పశువులను అటవీ సరిహద్దుల వైపు తోలొద్దని హెచ్చరించారు. పులి లేదా దాని పాదముద్రలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ దానిని వెంబడించే ప్రయత్నం చేయరాదని కోరారు. ప్రజలెవరూ భయాందోళనలకు గురికాకుండా తమకు సహకరించాలని అటవీ శాఖ విజ్ఞప్తి చేసింది.





# భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

## రష్యాతో డీల్ కుదుర్చుకోనున్న భారత్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** 'ఆపరేషన్ సిందూర్'లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలకు భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని భారత రక్షణశాఖ నిర్ణయించినట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్-400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీచేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించి నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్-400.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను విజయవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. ఎస్-400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ. దూరంలో ఎస్-400 కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్-400 అనేది ఒకే మిసైల్ కాదు. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ. వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్-400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం.. భారత్ మొత్తం 5 ఎస్-400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు 4 యూనిట్లు భారత్‌కు అందాయి. ఇంకో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో 5 యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోందని సమాచారం.

# సికింద్రాబాద్ మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ

## కట్టుదిట్టమైన భద్రత ఉన్నా రైఫిళ్లు మాయమైనట్లు సమాచారం

## దర్యాప్తునకు రంగంలోకి దిగిన బొల్లారం పోలీసులు

**హైదరాబాద్,సెప్టెంబర్ 1:** సికింద్రాబాద్‌లోని మద్రాస్ రెజిమెంట్ ప్రాంతంలో అత్యాధునిక ఆయుధాలు మాయమవడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆర్మీ కాంపౌండ్‌లోకి చొరబడిన దుండగులు ఆయుధాలు భద్రపరిచే గదికి సంబంధించిన తాళాన్ని పగలగొట్టి 12 ఆయుధాలను అపహరించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆర్మీ అధికారులు బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. చోరీకి గురైన ఆయుధాల్లో నాలుగు ఏకే-47 రైఫిళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్, ఆరు పిస్టళ్లు ఉన్నాయి. వీటితో పాటు పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి కూడా మాయమైనట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే రక్షణ వ్యవహారాలకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో పోలీసులు ఆయుధాల చోరీకి సంబంధించిన పూర్తి వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. మద్రాస్ రెజిమెంట్ ప్రాంతం చుట్టూ ఎత్తైన ప్రహరీతో పాటు మూడంచెల భద్రతా వ్యవస్థ కొనసాగుతోంది. రెజిమెంట్ ప్రాంతంలోకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా అనుమతి తప్పనిసరి. ఆయుధాలు, మందుగుండు సామగ్రి భద్రపరిచే స్టోర్స్ చుట్టూ ప్రత్యేక భద్రత ఉంటుంది. అంతేకాకుండా అత్యాధునిక సీసీ కెమెరాలతో నిత్యం నిఘా కొనసాగుతుంది. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత ఉన్న ప్రాంతంలోకి దుండగులు ఎలా ప్రవేశించారు.? ఆయుధాలు భద్రపరిచిన గది వరకు ఎలా చేరుకున్నారు.? తాళాన్ని ఎలా పగలగొట్టారు.? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు రెజిమెంట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రెజిమెంట్‌లోకి ఇటీవల ఎవరెవరు వచ్చారు.? ఎవరు బయటకు వెళ్లారు.? అనుమతులు ఎవరికి ఉన్నాయి.? అనే వివరాలను సేకరిస్తున్నారు. అలాగే అనుమానితులను కూడా పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఆయుధాల స్టోర్స్‌లో పనిచేసే సిబ్బంది, భద్రతా విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలను కూడా క్షుణంగా పరిశీలిస్తున్నారు. చోరీకి గురైన ఆయుధాలు, మందుగుండు సామగ్రి పరిమాణం దృష్ట్యా ఈ ఘటనలో ఒకరి కంటే ఎక్కువ మంది వ్యక్తులు పాల్గొని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నాలుగు ఏకే-47 రైఫిళ్లు, ఇన్సాస్ రైఫిల్, పిస్టళ్లు, మందుగుండు సామగ్రిని తీసుకెళ్లడానికి ఒకరి కంటే ఎక్కువ మంది వచ్చింటారని భావిస్తున్నారు. ఈ కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు ఆయుధాలు నిజంగా చోరీకి గురయ్యాయా? లేక ఎక్కడైనా ఇతర ప్రాంతంలో ఉంచి, రికార్డుల్లో నమోదు కాకపోవడం వల్ల మిస్సింగ్‌గా గుర్తించారా..? అనే కోణంలోనూ అధికారులు పరిశీలిస్తున్నారు. ఆయుధాల స్టాక్, రికార్డులు, గతంలో జరిగిన ఆడిట్ వివరాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.






# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశప్రజల సమిష్టి కృషితోనే జీడీపీ వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తి సామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని



చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్య్రం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

# తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

## తెరపైకి రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు

## ఇప్పుడే అలాంటి చర్చ అవసరం లేదన్న ట్రంప్




**వాషింగ్టన్, సెప్టెంబర్ 1 :** అమెరికా తదుపరి అధ్యక్షుడిగా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు తెరపైకి వస్తున్న వేళ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2028 ప్రెసిడెంట్ ఎలక్షన్స్‌లో పోటీచేసే అవకాశాలపై మాట్లాడిన అగ్రరాజ్య అధ్యక్షుడు.. ఆ విషయమై ఇప్పుడే చర్చ అక్కర్లేదని సమాధానాన్ని దాటవేశారు. 'హెగ్సెత్ అద్భుతంగా పని చేస్తున్నారు. అయితే ఇలాంటి విషయాల గురించి మాట్లాడేందుకు ఇది తొందరపాటు చర్య అవుతుంది. ముందుగా నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికలను పూర్తి చేయాలి' అని ట్రంప్ అన్నారు. యూఎస్ ప్రెసిడెంట్‌గా రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశమున్న ట్రంప్.. 2029లో ఆ పదవి నుంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఉద్యమాన్ని ముందుకు నడిపించే తదుపరి నేత ఎవరన్న దానిపై రిపబ్లికన్ పార్టీలో చర్చ జోరందుకుంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్లు ఇప్పటికే వినిపిస్తున్నా.. తాజాగా ఆ లిస్ట్‌లో హెగ్సెత్ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఐయోవా స్టేట్ ఫెయిర్‌లో రిపబ్లికన్ల తరఫున హెగ్సెత్ ప్రచారం చేయడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చినట్లైంది. అయితే ఈ వార్తలను హెగ్సెత్ ఖండించారు. అవి '100 శాతం అవాస్తవం' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారాయన. హెగ్సెత్ గతంలో ఆర్మీ నేషనల్ గార్డ్‌లో పనిచేశారు. అనంతరం ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన రాజకీయ భవితవ్యంపై ట్రంప్ మరింత ఆసక్తికరంగా స్పందించారు. 'ప్రస్తుతం ఆయనకు సైన్యం, సైనికుల సంక్షేమం తప్ప మరేదీ ముఖ్యం కాదు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 2028 అధ్యక్ష ఎన్నికల కోసం పలువురు నేతలు ఇప్పటికే అంతర్గతంగా సన్నాహాలు ప్రారంభించి ఉండొచ్చని ట్రంప్ చెప్పారు. ఏది ఏమైనా ట్రంప్ వారసుడిగా అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించనప్పటికీ.. జేడీ వాన్స్, మార్కో రూబియో, హెగ్సెత్ వంటి పేర్లు వినిపిస్తుండటం రిపబ్లికన్ పార్టీలో 2028 పోరుపై ఆసక్తి రేపుతోంది.

# రష్యా సైన్యంలో 51మంది భారతీయులు మృతి

## విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** రష్యా సైన్యంలోని 51 మంది భారతీయులు మరణించారని విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడించారు. మొత్తం 227 మంది రష్యాలో సైన్యంలో చేరగా ఇప్పటివరకూ 139 మంది బయటకు వచ్చేశారని అన్నారు. మిగిలిన వారినీ వెనక్కు తీసుకొచ్చేందుకు రష్యాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కిర్గిస్థాన్ పర్యటన నేపథ్యంలో సోమవారం మీడియా అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ సెక్రటరీ ఈ వివరాలను వెల్లడించారు. ఈ అంశంలో రష్యాతో వివిధ స్థాయిల్లో చర్చలు జరుగుతున్నాయని మిశ్రీ చెప్పారు. మాస్కోలోని భారతీయ ఎంబసీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ భారతీయులను వెనక్కు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. భారతీయులు త్వరగా సైన్యం నుంచి డిశ్చార్జ్ అయ్యేలా రష్యా చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. రష్యా-భారత్ వాణిజ్యం గురించి కూడా మిశ్రీ మాట్లాడారు. గతేడాది భారత్‌లో రష్యన్ దిగుమతిదారుల సమావేశంలో అక్కడి సంస్థలు ఉత్సాహంగా పాల్గొన్నాయని చెప్పారు. భారత్ నుంచి దిగుమతులను పెంచేందుకు ఉత్సుకత ప్రదర్శించాయని చెప్పారు. తదుపరి రష్యాలో జరుగునున్న సమావేశంలో భారతీయ ఎగుమతిదారుల ఫోరం సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సానుకూలంగా స్పందించారని అన్నారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఇటీవల కిర్గ్ రిపబ్లిక్ దేశ పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా సమావేశం అయ్యారు. యుద్ధాలకు శాశ్వత ముగింపు పలికేందుకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# విమానంలో సాంకేతిక లోపం

## అత్యవసరంగా గోవాలోనే ల్యాండింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** గోవా నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. మంగళవారం ఉదయం 9.15 గంటలకు గోవా ఎయిర్ పోర్ట్ నుంచి విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ సాంకేతిక లోపం ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన విమానం పైలట్ వెంటనే మనోహర్ ఎయిర్ పోర్ట్ అధికారులకు తెలియజేశారు. వారి అనుమతితో ఈ విమానాన్ని అత్యవసరంగా గోవా ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేశారు. దీంతో విమానంలోని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్ నేపథ్యంతో గోవా ఎయిర్‌పోర్టులో అధికారులు ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ విమానంలోని ప్రయాణికులను ఢిల్లీ తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో యాజమాన్యం ఈ సందర్భంగా వెల్లడించింది. అందుకోసం మరో విమానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో తెలిపింది. విమానం టేకాఫ్ అయిన ఐదు నిమిషాలకే ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు కనుగొన్నారని వివరించింది. విమానంలో ఏర్పడిన సమస్యను గుర్తించే పనిలో సాంకేతిక సిబ్బంది ఉన్నారని పేర్కొంది. ప్రయాణికులతోపాటు విమాన సిబ్బందికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని ఇండిగో సంస్థ తెలిపింది.

# జీడీపీ వృద్ధిరేటు గణాంకాల గారడీ

## ధరలు మోత మోగిస్తుంటే..వృద్ధి ఎలా సాధ్యం

## ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తు తోందని ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదని అన్నారు. రాగి వైర్ ధర రూ.850 నుంచి రూ.1,700కి, అల్యూమినియం ధర రూ.350 నుంచి రూ.650 కి చేరిందని వెల్లడించారు. 1,000 చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ.50 వేల నుంచి లక్ష రూపాయిలకు పెరిగిందని చెప్పారు. హోమ్ అప్లయన్సెస్, ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయని అన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికులు ఖర్చు ఇలా అన్ని పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కూడా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగున పరిచి, గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఉందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయని అన్నారు. వీక్ సెంటీమెంట్‌ను ప్రతిఫలించట్లేదని చెప్పారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత్ ప్రగతిబాటలో దూసుకుపోతుంటే నిరాశావాదులు మాత్రం అసత్యాలను ప్రతిధ్వనిస్తున్నారని విమర్శించారు. ఈ వృద్ధి



రేటు భారతీయుల సమష్టి శక్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ వృద్ధి రేటుకు కొనసాగించేందుకు భారతీయులు దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు.

# భూ వివాదంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

**రాజకీయ అండతో దౌర్జన్యం చేసి మాపై దాడి చేసారని వెంకట రెడ్డి కుటుంబం సభ్యులు ఆరోపణ...**

## తహసీల్దార్‌ను అడ్డుకున్న బాధితులు..







**రామచంద్రాపురం, సెప్టెంబర్ 01:** మండలంలోని అనుపల్లి పంచాయతీ పరిధి ఉప్పలివంక గ్రామంలో భూ వివాదం మంగళవారం ఉద్రిక్తతకు దారితీసింది. ఉప్పిలివంక వద్ద సర్వే నంబర్ 318/1 భూమికి సంబంధించి ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఎద్దుల వెంకటరెడ్డి ఎద్దుల వాసుదేవ రెడ్డికి మధ్య భూ భూ వివాదం తారా స్థాయికి చేరుకుంది వాసుదేవ రెడ్డి 318 /1 సర్వే నెంబర్లను సర్వే చేయాల్సిందిగా రెవిన్యూఅధికారులకు దరఖాస్తు చేసుకున్నారు మంగళవారం తాసిల్దార్ మధుసూదన్ రావు విలేజ్ సర్వేయర్ శశి తో కలిసి భూమిపైకి చేరుకున్నారు అనుభవంలో ఉన్న భూమిని ఎలా సర్వే చేస్తారని యెద్దుల వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులు తాము గత 50 సంవత్సరాలుగా ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని వాసుదేవ రెడ్డి దొంగ పట్టాలు సృష్టించుకుని అధికార పార్టీ అండతో తరచూ మాపై దౌర్జన్యం చేస్తూ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు భూమిని సర్వే చేసేందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు మాకు న్యాయం చేయాలని కోరారు దీంతో తాసిల్దార్ ఇరువర్గాలను కార్యాలయం రమ్మని ఆదేశించి వెనుదిరిగేందుకు ప్రయత్నం చేశారు దీంతో సమస్య పరిష్కరించే అంతవరకు ఇక్కడి నుంచి కదలడానికి వీలు లేదని తాసిల్దార్ వాహనానికి అడ్డుపడ్డారు అక్కడున్న పాత్రికేయులు దీనిపై వివరణ ఇవ్వాలని తాసిల్దార్ ను కోరగా సమాధానం ఇవ్వకుండా నేరుగా కారు ఎక్కేశారు అనంతరం పోలీసులు జోక్యం చేసుకొని తాసిల్దార్ అక్కడ నుంచి పంపారు అనంతరం మీడియాతో వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సభ్యులు సంవత్సరాలుగా సాగు చేసుకున్నట్లు బాధితులు రాజశేఖర్ రెడ్డి తెలిపారు సదరు భూముల్లో వాసుదేవ రెడ్డి దొంగ పట్టాలు సృష్టించుకుని సర్వేకు రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నారు తాసిల్దార్ మధుసూదన్ రావు గ్రామ సర్వే శశి తో కలిసి తో కలిసి సర్వే నిర్వహించడానికి దీనితో ఇరు వర్గాలు భూమిపై విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అయితే తమ భూ సమస్యను పరిష్కరించకుండానే తహసీల్దార్ అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించారని బాధిత రైతులు ఆరోపించారు. తహసీల్దార్ వాహనం ఎదుటే రైతులు నిరసనకు దిగారు. తమకు అన్యాయం జరుగుతోందని, తమ భూమికి సంబంధించిన సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూ వివాదంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఈ ఘటనతో ఉప్పిలివంక ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

# వంద కోట్లతో కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి

- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు
- కొండపల్లిలో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం.



**కొండపల్లి, సెప్టెంబర్ 1:** కొండపల్లి మున్సిపాలిటీని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం రూ.2 కోట్ల అంచనా వ్యయంతో వివిధ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. కొండపల్లిలో పుట్టలమ్మ గట్టు ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ పాఠశాల. తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఇప్పటికే కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించామని వెల్లడించారు. కొండపల్లి మున్సిపాలిటీకి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.46 కోట్ల నిధులు, అదేవిధంగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ. 25 కోట్ల నిధులు, మరోవైపు సిఏఎం కింద తాజాగా మరో రూ. 25 కోట్ల నిధులు మంజూరు అయినట్లు వెల్లడించారు. మరో రూ. 4కోట్లు మున్సిపాలిటీలో జనరల్ నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. కొండపల్లిలో ఆయా నిధుల వినియోగం కోసం ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. అనంతరం శాంతినగర్‌లో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యలకు పరిష్కారం లభించనుంది. అలాగే ఆర్.సి.ఎం కాలనీలో పక్కా డ్రైన్లు మరియు వాటర్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈలప్రోలు రోడ్డులోని ప్రభుత్వ కాలనీలో ఏర్పాటు చేసిన వాటర్ పైప్‌లైన్‌ను కూడా ప్రారంభించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు డి.ఎం.ఎఫ్.టి నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, సి.ఆర్.డి.ఏ గ్రాంట్ మరియు జనరల్ ఫండ్ ద్వారా మొత్తం సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టినట్లు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు తెలిపారు. కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యా సౌకర్యాలు వంటి మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ, కొండపల్లిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య, ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత సెక్రటరీ, ఇబ్రహీంపట్నం మండల క్లస్టర్ ఇంచార్జ్ గరికపాటి శివ మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టి బాబు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈల పటిష్టతతోనే దీర్ఘకాల లక్ష్యం సాధ్యం



- స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానమే ప్రభుత్వ లక్ష్యం
- ఏపీలో ఎంఎస్ఎంఈలకు అనుకూల వాతావరణం
- ఎస్ఐసిసిఐ 116వ వార్షిక సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, సెప్టెంబర్ 1:** ఎంఎస్ఎంఈల పటిష్టతతోనే 2047 లక్ష్యాలు సాధ్యమవుతాయని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం దక్షిణ భారత చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 116వ వార్షిక సర్వసభ్య సమావేశం చెన్నైలోని హోటల్ లీలా ప్యాలెస్‌లో ఘనంగా జరిగింది. దక్షిణ భారతదేశంలో వ్యాపార, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఈ సమావేశంలో చర్చలు జరిపారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొండపల్లి మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలను, యువతను ప్రోత్సహించడం ద్వారానే సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకు ప్రభుత్వం, పారిశ్రామిక వర్గాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని మంత్రి పిలుపుఇచ్చారు. పారిశ్రామిక పార్కులు, ఉమ్మడి వసతులు, ఆర్థికసాయంతో ఏపీలో ఎంఎస్ఎంఈలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇండియా–ఈయూ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్, ఎన్ఆర్ఐ వర్గాల సహకారంతో స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఎస్ఐసిసిఐ అధ్యక్షుడు అరుణ్ అలగప్పన్ మాట్లాడుతూ 2047 నాటి భారత వికాస లక్ష్యాలు చిన్న తరహా పరిశ్రమల ప్రగతిపైనే ఆధారపడి ఉన్నాయని.. తమిళనాడు సాధించాలనుకుంటున్న ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రప్రదేశ్ నిర్దేశించుకున్న 'స్వర్ణాంధ్ర ఏ2047' లక్ష్యాల సాధనలో చిన్న పరిశ్రమలే కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మద్రాస్ యూనివర్సిటీ, అన్నామలై యూనివర్సిటీ, లయోలా ఇన్‌స్టిట్యూట్, త్యాగరాజ కాలేజ్, భారతిదాసన్ యూనివర్సిటీ విద్యార్థులకు మంత్రి పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం ఎస్ఐసిసిఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వి.ఎన్. శివ శంకర్ పాల్గొన్నారు.

# పార్టీ నియమాలను పాటించాలి

**టీడీపీ సీనియర్ నేత కొండపల్లి కొండలరావు**



**విజయనగరం, సెప్టెంబర్ 1:** కొత్తగా తెలుగుదేశం పార్టీలో చేరిన వారు పార్టీ నియమాలను పాటించాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు సూచించారు. మంగళవారం విజయనగరం మంత్రి క్యాంప్ కార్యాలయం నందు గజపతినగరం నియోజకవర్గం గంట్యాడ మండలం పొల్లంకి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, మాజీ వార్డు మెంబర్లు రావాడ అప్పన్న, వగల దేవుడు మరియు 20 కుటుంబాల వారు వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలో చేరారు. కొండలరావు తెలుగుదేశం పార్టీ కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీలో చేరిన వారు సీనియర్ నాయకుల సమన్వయంతో ముందుకు సాగాలని, పార్టీ నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గంట్యాడ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జిలు అల్లు విజయకుమార్, రండి చిన రామానాయుడు, బూడి అప్పలనాయుడు, తాటిపూడి ప్రాజెక్టు చైర్మన్ కళ్ళంపూడి జగన్నాథం, రంది రాము నాయుడు, దేవుడు బాబు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# "శిశు వికాస్ యోజన" ఎంతో ఉపయోగం

**సి ఎస్ ఆర్ ఫండ్స్ సద్వినియోగం చేసుకోండి**

**యుటిఎఫ్ నేత ఖాదర్ బాషా**




**తిరుపతి, సెప్టెంబర్ 1 :** ఐదు నుంచి 16 ఏళ్ల లోపు బాలబాలికలకు పివిఆర్ గ్రూప్ ఆర్గనైజేషన్ ద్వారా సి ఎస్ ఆర్ ఫండ్స్ ను అందించే శిశు వికాస్ యోజన సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని యుటిఎఫ్ నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ ఖాదర్ బాషా పివిఆర్ సంస్థ వ్యవస్థాపకులు, శిశు వికాస్ యోజన రాష్ట్ర సూపర్వైజర్ పూసపాటి వెంకటరమణ, శిశు వికాస్ యోజన రాష్ట్ర ఆర్గనైజర్ సుకుమార్ రాజులు పిలుపు నిచ్చారు. మంగళవారం ఉదయం వారు విద్యార్థులకు శిశు వికాస్ యోజన పథకం పై అవగాహన కల్పించారు. బాల బాలికలకు ఎంతో ఉపయోగకరమైన ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీరితోపాటు తిరుపతి జిల్లా శిశు వికాస్ యోజన ఇన్చార్జ్ ఉమాపతి, కోఆర్డినేటర్ రాజేశ్వరి, కంప్యూటర్ ఆపరేటర్ ధరణి పతి పాల్గొన్నారు.

# నూతన వెంచర్ ను ప్రారంభించిన స్యామ్ కోటీశ్వర్




**పలమనేరు సెప్టెంబర్ 1:** పలమనేరు పట్టణ సమీపంలో నూతన వెంచర్ ను ఆదివారం ప్రారంభించడం జరిగింది. ఈ వెంచర్ లో 30ఐ40–40ఐ60 ప్లాట్లు వేయడం జరిగిందని బెంగళూరు తరహాలో అండర్ డ్రైనేజ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ వెంచర్ లో బోరు వేయడం, రోడ్లు 30 అడుగులు వెడల్పు రోడ్డులు ఏర్పాటు చేయడం జరిగిందని పలమనేరు పట్టణంలో మొట్టమొదటిసారిగా డిటిసిపి అప్రూవల్ లేఔట్ ప్రభుత్వ నిబంధనలను తూచా పాటిస్తూ ఈ లేఅవుట్ నిర్మించడం జరిగింది. ఈ లేఅవుట్ కు సంబంధించి 450 మీటర్ల తారు రోడ్డు 25 లక్షల వ్యయంతో ప్రజల సౌకర్యార్థం వేయడం, అలాగే మున్సిపల్ త్రాగునీరు కూడా తెప్పించడం జరిగింది. 3 పేస్ కరెంటు సౌకర్యం కూడాఉంది అందులో సోలార్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ వెంచర్లో పిల్లలు ఆడుకునేందుకు బుద్ధుని విగ్రహం ఏర్పాటు చేశారు. సాయంకాలం సమయంలో ఆహ్లాదకరమైన వాతావరణం, చల్లటి గాలులు కలిగి న ప్రదేశం అని తెలిపారు. అదేవిధంగా సరసమైన పదరాలకు విక్రయించడం జరుగుతుందన్నారు. బెంగళూరు నగరంలో వెంచర్లు ఎలా ఏర్పాటు చేశారో ఆ తరహా లోనే ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నైట్ వాచ్ మెన్ సౌకర్యం కూడా కలదు. ఎవరైనా ప్లాట్లుకున్న వారికి విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు మన వెంచర్ నందు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పలమనేరు పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఒకసారి మా నూతన వెంచర్ను వచ్చి విజిట్ చేసుకొని వెళ్లాలని కోరుతున్నాను. ఈ నూతన వెంచర్ ను శామ్ కోటేశ్వర్ తో పాటుశీలం భాస్కర్ అన్ని ఏర్పాట్లు ప్రజలకు కావలసిన సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

**కొండపల్లి, సెప్టెంబర్ 01:** పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఇచ్చిన మాట ప్రకారం ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా అర్హులైన లబ్ధిదారులకు ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తున్నామని మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. సెప్టెంబర్ నెల ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లు అందజేస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో సెప్టెంబర్ మాసానికి సంబంధించి 42,979 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 18.85 కోట్ల పింఛన్లు అందజేస్తున్నామని, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), జంపాల సీతారామయ్య కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు



వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరులోని కొండమిట్టలో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించిన ఎంపీ దగ్గుమళ్ళ ఎమ్మెల్యే గురజాల



**చిత్తూరు, సెప్టెంబర్ 01:** చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని 28వ వార్డు కొండ మిట్ట, వినాయకపురంలో రూ. 31 లక్షల ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు , ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొండ ప్రాంతంలో ఉన్న స్థానిక ప్రజల అవసరాల కోసం ట్యాంకును నిర్మించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలని ఆలోచనతో అభివృద్ధి పనులు చేయిస్తోందన్నారు. నగరంలో నీటి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు వేగవంతంగా తీసుకుంటోందని, రానున్న రోజుల్లో చిత్తూరు ప్రజలకు నీటి సమస్య లేకుండా శాశ్వత పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నీటి కొళాయి ద్వారా నీటి పంపిణీ ప్రారంభించారు. అనంతరం స్థానికంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. వృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు 12వ వార్డు అరుల్ పురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కటారి హేమలత, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, కూటమి నాయకులు సీకే లావణ్య, కుమారి, కాజూరు బాలాజీ, రాజేష్ కుమార్ రెడ్డి, చిట్టిబాబు, నరేష్, పచ్చయప్ప, క్లస్టర్,యూనిట్, బూత్, డివిజన్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

# ప్రజల రాకపోకలకు అడ్డంకులు సృష్టించడం తగదు

- గాంధీపురం రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల నాయకుల డిమాండ్




**తిరుపతి:** తిరుపతి నగరంలోని గాంధీపురం ప్రాంతంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే విధంగా చేపడుతున్న చర్యలను విరమించుకుని, స్థానిక ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రహదారి సదుపాయం కల్పించాలని సిపిఎం, దళిత సంఘాలు, బీసీ సంఘాలు, స్థానిక హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. గాంధీపురంలో మంగళవారం సిపిఎం, దళిత సంఘాలు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో రహదారి సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, స్థానిక దళిత నాయకులు నల్లని బాబు, వైఎస్సార్ ఎస్సీ సెల్ నాయకులు తలారి రాజేంద్ర, స్థానిక హక్కుల పోరాట సమితి నాయకులు డీఎంసీ భాస్కర్, బొమ్మగుంట రవి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తిరుపతి నగరం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ప్రజలకు అవసరమైన రహదారులు, మౌలిక సదు-పాయాలు విస్తరించాల్సింది పోయి, ఇప్పటికే ప్రజలు వినియోగిస్తున్న మార్గాలను పరిమితం చేయడం సమంజసం కాదన్నారు. గాంధీపురం పరిసర ప్రాంతాల్లో వేలాది మంది ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో, వారి అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ప్రజల ప్రయోజనాల కంటే నిర్మాణాలు, ప్రహరీలు ముఖ్యమనే విధంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. నగరంలో అనేక ప్రాంతాల్లో రోడ్లు ఇరుకుగా ఉండటం, గుంతలు ఏర్పడటం, అసంపూర్తి పనులు కొనసాగడం వల్ల ఇప్పటికే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు సులభంగా రాకపోకలు సాగించే మార్గాలను కూడా మూసివేస్తే సమస్య మరింత జటిలంగా మారుతుందని అన్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు ఇతర సేవలు సకాలంలో చేరుకునే అవకాశం ఉండేలా పట్టణ ప్రణాళిక ఉండాలని సూచించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యల విషయంలో రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని సమావేశం అభిప్రాయపడింది. ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలపై అన్ని రాజకీయ, సామాజిక సంఘాలు స్పందించాలని నాయకులు పిలుపునిచ్చారు. గాంధీపురం ప్రాంత ప్రజల రాకపోకల సమస్యకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత అధికారులు చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను కొనసాగిస్తే స్థానిక ప్రజలను, వివిధ ప్రజాసంఘాలను సమీకరించి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తిరుపతి నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, ఎం. నరేంద్ర, పి. బుజ్జి, వాసు, సిద్ధు, రామకృష్ణ, శ్రీరాములు, మురళి, విజయ్, స్థానికులు, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# చెస్ విజేతలకు జంపాల అభినందనలు

## రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులకు ఘన సత్కారం



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 1:** రాష్ట్రస్థాయి అండర్ 14 చెస్ చాంపియన్షిప్ లో విజయం సాధించి జాతీయ స్థాయి చెస్ పోటీలకు అర్హత సాధించిన కొండపల్లి స్థానిక డిఏవి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బి ఆరాధ్య, షేక్ ఉమ్మే కులుసుం బాను లను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య ఘనంగా సత్కరించారు. ఆగస్టు 28,29 తేదీలలో విజయనగరం జిల్లా రాజాం పట్నంలో జరిగిన అండర్-14 స్టేట్ టోర్నమెంట్లో విశేష ప్రతిభ తో మొదటి స్థానం సాధించి, రాష్ట్రం తరఫున ఆడేందుకు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు స్టేట్ ఫస్ట్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన బాలికలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య అభినందించారు. ఆరాధ్య, మరియు కులుసు లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదేవిధంగా ప్రతిభ కనిపించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని, వారికి ఎటువంటి సహాయ, సహకారాలు అవసరమైనా తోడ్పాటు ను అందించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం కోగంటి బాబు



**కంచికచర్ల, సెప్టెంబర్ 1:** కంచికచర్ల పట్టణంలో సెప్టెంబర్ నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కోగంటి బాబు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

# దొంగతనాలపై పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## విజయనగరం 1వ పట్టణ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి



**విజయనగరం, సెప్టెంబర్1:** విజయనగరం పట్టణంలోని 1వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని విజయనగరం 1వ పట్టణ సీఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి సెప్టెంబర్ 1న తెలిపారు. దొంగతనాలు, ఇళ్లలో చోరీలు, ద్విచక్ర వాహనాల అపహరణ, దుకాణాల్లో చోరీలు వంటి నేరాలపై 1వ పట్టణ పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల నమోదైన పలు దొంగతనం కేసుల్లో సీసీ కెమెరాల దృశ్యాలు, సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలను విశ్లేషించి నిందితులను గుర్తించామన్నారు. నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ ఇళ్లు, దుకాణాలు, వాహనాల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వీలైనంతవరకు ఇల్లు, అపార్ట్ మెంట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు. బయటకు వెళ్లే సమయంలో ఇళ్ల తలుపులు, కిటికీలు సక్రమంగా లాక్ చేయడంతో పాటు విలువైన వస్తువులను ఇళ్ళలో ఉంచవద్దన్నారు. వాహనాలను తప్పనిసరిగా తాళం వేసి, సాధ్యమైనంత వరకు సురక్షితమైన ప్రదేశాల్లో పార్క్ చేయాలని సూచించారు. 1వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు లేదా 1వ పట్టణ సీఐ 9121109419కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారంతో దొంగతనాలను మరింత సమర్థవంతంగా అరికడతామని 1వ పట్టణ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి తెలిపారు.

# తిరుపతి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**పలమనేరు సెప్టెంబర్ 1:** పలమనేరు పట్టణ సమీపంలోని గంటావూరు బీసీ కాలనీలో యుందు శ్రీ తిరుపతి గంగమ్మ దేవస్థానం నందు శ్రీ తిరుపతి గంగమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ తోపాటు పూజలు నిర్వహించారు. ఉదయం నుండి సాయంకాలం వరకు గంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలను బాబు స్వామి భక్తులకు పంచిపెట్టారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పుష్పాలంకరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్, స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ మురుగన్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించడం జరిగింది.



# పాక్ క్రికెట్‌లో ముసలం!

- సెలెక్టర్ పదవికి మిస్బా రాజీనామా
- సీనియర్ల వేటుపై తీవ్ర అసంతృప్తి
- ఏడుగురు ఆటగాళ్లను ఇంటికి పంపిన పీసీబీ
- కోచ్ సర్ఫరాజ్, ఉమర్ గుల్‌పైనా వేటు
- ఇంగ్లండ్ చేతిలో సిరీస్ కోల్పోయిన పాక్

**లండన్:** అనిశ్చితికి మారుపేరుగా నిలిచే పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి ముసలం మొదలైంది. ఇంగ్లండ్ పర్యటనలో వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీసుకున్న కఠిన నిర్ణయాలు జట్టులో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సిరీస్ మధ్యలోనే సీనియర్ ఆటగాళ్లను స్వదేశానికి పంపడంతో పాటు కోచింగ్ బృందంపైనా వేటు వేయడాన్ని నిరసిస్తూ సెలెక్టర్ మిస్బావుల్ హక్ తన పదవికి రాజీనామా చేశాడు. లార్డ్స్ టెస్టులో పాకిస్థాన్ ఘోర పరాజయం తర్వాత పీసీబీ ప్రక్షాళనకు దిగింది. జట్టులోని ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపాలని నిర్ణయించింది. అంతటితో ఆగకుండా కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను బాధ్యతల నుంచి తప్పించి.. మూడో టెస్టుకు వైట్‌బాల్ కోచ్ మైక్ హెసన్‌కు బాధ్యతలు అప్పగించింది. బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌పైనా వేటు వేసింది. తాము ఎంపిక చేసిన జట్టులోని ఆటగాళ్లను సిరీస్ మధ్యలోనే తొలగించడం, కోచింగ్ బృందాన్ని మార్చుడంపై మిస్బా తీవ్ర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. బోర్డు నిర్ణయాలతో మనస్తాపం చెందిన అతడు మంగళవారం సెలెక్టర్ పదవికి హఠాత్తుగా రాజీనామా చేశాడు. అయితే మిస్బా రాజీనామాను పీసీబీ ఇంకా ఆమోదించాల్సి ఉంది. నేషనల్ క్రికెట్ అకాడమీలో బ్యాటింగ్ కోచ్ బాధ్యతల నుంచి కూడా అతడు తప్పుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. లార్డ్స్ టెస్టు పరాజయం తర్వాత మహ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘా, అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, అవైస్ జఫార్, ఖుర్రం షెహజాద్‌లను జట్టు నుంచి తప్పించినట్లు సమాచారం. వీరి స్థానంలో సయీం అయూబ్‌తో పాటు అరాఫత్ మిన్హాస్, మహ్మద్ ఇమ్రాన్, సాద్ బైగ్, ఇమ్రాన్ రంధవా, రజుల్లాహ్ తదితర యువ ఆటగాళ్లకు చివరి టెస్టులో అవకాశం కల్పించనున్నారు. హెడింగ్లేలో తొలి టెస్టును సొంతం చేసుకున్న ఇంగ్లండ్.. లార్డ్స్‌లోనూ జోరు కొనసాగించింది. 389 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ బ్యాటింగ్ మరోసారి కుప్పకూలింది. షాద్ షకీల్ 97 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. ఓలీ రాబిన్సన్ (4-24), జోష్ టంగ్ (3-46), జోఫ్రా ఆర్చర్ (2-73) విజృంభించడంతో ఇంగ్లండ్ 194 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఇంగ్లండ్ సిరీస్‌ను కైవసం చేసుకోగా.. పాకిస్థాన్‌కు మూడో టెస్టు నామమాత్రంగా మారింది. చివరి టెస్టు సెప్టెంబర్ 9న బర్మింగ్‌హమ్‌లో జరగనుంది. ఓవైపు వరుస ఓటములు.. మరోవైపు సీనియర్లపై వేటు.. ఇప్పుడు సెలెక్టర్ మిస్బా రాజీనామా.. వెరసి పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి సంక్షోభ మేఘాలు కమ్ముకున్నాయి.

# టెన్నిస్ కోర్టే ఫ్యాషన్ ర్యాంప్!

- బాస్కెట్‌బాల్ దిగ్గజం లుక్‌లో ఒసాకా
- అలెన్ ఐవెర్సన్‌కు స్టయిల్‌తో నివాళి
- యూఎస్ ఓపెన్‌లో మరోసారి ప్రత్యేక ఆకర్షణ
- ఆటతో పాటు ఫ్యాషన్‌లోనూ తనదైన ముద్ర
- తొలి రౌండ్‌లో గెలిచి ముందంజ




**న్యూయార్క్:** టెన్నిస్ కోర్టులో ఆటతో ప్రత్యర్థులను హడలెత్తించడమే కాదు.. తన ఫ్యాషన్‌తో ప్రేక్షకులను అబ్బురపరచడం జపాన్ స్టార్ నవోమి ఒసాకాకు కొత్తేమీ కాదు. గ్రాండ్‌స్లామ్ టోర్నీ వచ్చిందంటే చాలు.. ఏదో ఒక ప్రత్యేక థీమ్‌తో కోర్టులోకి అడుగుపెట్టి అందరి దృష్టినీ ఆకర్షిస్తుంటుంది. తాజాగా యూఎస్ ఓపెన్-2026లోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. ఈసారి అమెరికా బాస్కెట్‌బాల్ దిగ్గజం అలెన్ ఐవెర్సన్‌ను గుర్తుచేసే లుక్‌తో వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్ కోసం ఒసాకా వినూత్న వేషధారణతో కోర్టులోకి వచ్చింది. పొడవాటి తెల్లని స్కర్ట్, వదులుగా ఉన్న హుడీతో ప్రవేశించిన ఆమె.. ఆ తర్వాత వాటిని తొలగించి ఐవెర్సన్‌ను తలపించే స్టయిల్‌లో కనిపించింది. జుట్టును 'కార్న్‌రోస్' తరహాలో తీర్చిదిద్దుకోవడంతో ఆమె లుక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కోర్టులోకి వచ్చే ముందు ఐవెర్సన్ చిత్రం ముద్రించిన షర్ట్‌ను ధరించి అతడిపై తనకున్న అభిమానాన్ని చాటుకుంది. తన కొత్త లుక్‌పై ఒసాకా స్పందిస్తూ.. ఐవెర్సన్ ఆటతో పాటు అతడి ఫ్యాషన్ తనకు ఎంతో ఇష్టమని తెలిపింది. తనదైన స్టయిల్‌తో బాస్కెట్‌బాల్ ప్రపంచంలో ప్రత్యేక ముద్ర వేసిన ఐవెర్సన్.. క్రీడాకారుల దుస్తుల తీరుపైనా ప్రభావం చూపాడని పేర్కొంది. 'ఫ్యాషన్‌తోనూ మన వ్యక్తిత్వాన్ని చెప్పొచ్చు' అన్న భావనను ఒసాకా వ్యక్తం చేసింది. తనను అనుకరిస్తూ ప్రత్యేక లుక్‌లో కోర్టులోకి వచ్చిన ఒసాకాపై ఐవెర్సన్ కూడా ప్రశంసలు కురిపించాడు. తనకు దక్కిన గొప్ప గౌరవంగా దీనిని అభివర్ణిస్తూ ఆమెను ప్రత్యక్షంగా చూసేందుకు ఎదురుచూస్తున్నట్లు సందేశం పంపాడు. ఫ్యాషన్‌తోనే కాకుండా ఆటలోనూ ఒసాకా ఆకట్టుకుంది. తొలి రౌండ్‌లో జఖరోవాపై విజయం సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. విభిన్న వేషధారణతో గ్రాండ్‌స్లామ్‌లలో సందడి చేయడం ఒసాకాకు అలవాటే. గత యూఎస్ ఓపెన్‌లో 'లబుబు' బొమ్మలతో ప్రత్యేకంగా కనిపించి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ ఆక్వా బ్లూ రంగు జాకెట్, వెడల్పాటి తెల్లని ప్యాంట్, తెల్లటి ముసుగు, టోపీ, చేతిలో గొడుగుతో ఫ్యాషన్ సుందరిలా కోర్టులోకి అడుగుపెట్టి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. రాకెట్‌తో ఆటలో తనదైన ముద్ర.. వేషధారణతో ఫ్యాషన్‌లో ప్రత్యేక ముద్ర.. రెండింటినీ కలిపి టెన్నిస్ కోర్టునే ఫ్యాషన్ వేదికగా మార్చేస్తోంది నవోమి ఒసాకా.

# పాటిదార్‌పై ఇషాన్ పైచేయి!

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్‌జోన్
- 4 వికెట్ల తేడాతో సెమీస్‌లో గెలుపు
- వైభవ్, ఇషాన్ మెరుపు బ్యాటింగ్
- ఏడు వికెట్లతో ముకేశ్ కుమార్ సత్తా
- దూబె తిప్పేసినా తప్పని ఓటమి




**బెంగళూరు:** దేశవాళీ సీజన్‌లో ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీలో ఈస్ట్‌జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇషాన్ కిషన్ సేన సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌ను నాలుగు వికెట్ల తేడాతో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (40), కెప్టెన్ ఇషాన్ కిషన్ (39) బ్యాట్‌తో మెరవగా.. ముకేశ్ కుమార్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లతో విజయంలో కీలకపాత్ర పోషించాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో జరిగిన సెమీఫైనల్లో తొలి ఇన్నింగ్స్‌లో రింకూ సింగ్ (60) అర్ధశతకంతో రాణించినా ప్రత్యర్థి జట్టు 266 పరుగులకే ఆలౌటైంది. అనంతరం హర్ష్ దూబే (4-66), ఆర్యన్ పాండే (3-43) బంతితో విజృంభించడంతో ఈస్ట్‌జోన్ కూడా సరిగ్గా 266 పరుగులకే కుప్పకూలింది. దీంతో తొలి ఇన్నింగ్స్ ముగిసేసరికి రెండు జట్లు సమానంగా నిలిచాయి.

## ముకేశ్ దెబ్బకు 158కే కుప్పకూలి..

రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించి ఈస్ట్‌జోన్‌కు సవాల్ విసరాలని భావించిన ప్రత్యర్థి జట్టుకు ముకేశ్ కుమార్, అభిజిత్ సర్కార్ షాకిచ్చారు. వీరిద్దరి ధాటికి బ్యాటింగ్ లైనప్ నిలవలేక 158 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఈస్ట్‌జోన్ ముందు 159 పరుగుల లక్ష్యం నిలిచింది.

## వైభవ్ ధనాధన్.. ఇషాన్ దంచుడు

స్వల్ప లక్ష్య ఛేదనలో ఈస్ట్‌జోన్ ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (24), వైభవ్ సూర్యవంశీ (40) దూకుడుగా ఆడి శుభారంభం అందించారు. ముఖ్యంగా వైభవ్ వేగంగా పరుగులు రాబట్టి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. అయితే హర్ష్ దూబే మరోసారి బంతితో చెలరేగి 53 పరుగులకు నాలుగు వికెట్లు పడగొట్టడంతో ఈస్ట్‌జోన్ కాస్త తడబడింది. అయితే గాయం కారణంగా రెండో రోజు ఆటకు దూరమైన కెప్టెన్ ఇషాన్ కిషన్ కీలక సమయంలో బాధ్యత తీసుకున్నాడు. 39 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయానికి చేరువ చేశాడు. చివర్లో మహమ్మద్ షమీ విన్నింగ్ షాట్ కొట్టడంతో ఈస్ట్‌జోన్ నాలుగు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుని ఫైనల్లో అడుగుపెట్టింది. దూబె రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ బంతితో పోరాడినా.. వైభవ్ దూకుడు, ఇషాన్ కీలక ఇన్నింగ్స్, ముకేశ్ కుమార్ బౌలింగ్ జోరుతో ఈస్ట్‌జోన్ ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది.



# అన్ని ఫార్మాట్ల పేసర్‌గా ఎదగాలి

## అదే నా లక్ష్యం: గుర్నూర్ బ్రార్

**బెంగళూరు:** మూడు ఫార్మాట్లలోనూ సత్తా చాటగల పేసర్‌గా ఎదగడమే తన ప్రధాన లక్ష్యమని భారత యువ ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్ తెలిపాడు. సీనియర్ పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలతో కలిసి బౌలింగ్ చేయడం తనకు ఎంతో ఉపయోగపడిందని చెప్పాడు. ముఖ్యంగా బంతిని సరైన లెంగ్త్‌లో వేయడంలో స్థిరత్వం సాధించేందుకు వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు పేర్కొన్నాడు. ఇప్పటివరకు భారత్ తరఫున ఆరు వన్డేలు ఆడిన గుర్నూర్ 6.96 ఎకానమీతో 11 వికెట్లు పడగొట్టి అంతర్జాతీయ కెరీర్‌కు మంచి ఆరంభం ఇచ్చాడు. రంజీ ట్రోఫీ, ఇండియా 'ఎ' తరఫున కనబరిచిన ప్రదర్శనతోనే భారత జట్టులో అవకాశం దక్కిందని తెలిపాడు. "బౌలింగ్‌లో లెంగ్త్‌ను నిలకడగా కొనసాగించడం, పిచ్ పరిస్థితులకు అనుగుణంగా ఒక్కో బ్యాటర్‌కు ఎలా బౌలింగ్ చేయాలన్న అంశాలపై మరింత అవగాహన పెంచుకుంటున్నా. ఎన్ని ఓవర్లు వేసినా శరీరంపై ఎక్కువ ప్రభావం పడకుండా ఫిట్‌నెస్‌ను తీర్చిదిద్దుకోవాలన్నది మొదటి నుంచీ నా లక్ష్యం" అని గుర్నూర్ చెప్పాడు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఇచ్చిన సలహాలతో తన బౌలింగ్‌లో గణనీయమైన మార్పు వచ్చిందన్నాడు. "బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణల బౌలింగ్‌ను దగ్గరగా పరిశీలించా. వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. వారిలాగే అన్ని ఫార్మాట్లలో రాణించే పేసర్‌గా ఎదగడానికి ప్రయత్నిస్తున్నా" అని పేర్కొన్నాడు. ప్రస్తుతం దులీప్ ట్రోఫీలో నార్త్‌జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న గుర్నూర్ బ్రార్.. సౌత్‌జోన్‌తో జరిగిన సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టి మరోసారి తన సత్తా చాటాడు.

# ఆఫ్ఘన్‌తో టీ20 పోరుకు టీమిండియా రెడీ

- కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్
- వైస్ కెప్టెన్‌గా తిలక్ వర్మ
- వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు
- బుమ్రా పునరాగమనం
- సెప్టెంబర్ 13 నుంచి మూడు మ్యాచ్‌ల సిరీస్



**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును పురుషుల సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ఈ సిరీస్‌లో టీమిండియాకు శ్రేయాస్ అయ్యర్ నాయకత్వం వహించనుండగా.. హైదరాబాదీ యువ బ్యాటర్ తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జట్టులో సీనియర్లతో పాటు యువ ఆటగాళ్లకు సెలక్టర్లు ప్రాధాన్యం ఇచ్చారు. బ్యాటింగ్ విభాగంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కింది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ కూడా జట్టులో చోటు సంపాదించారు. సంజూ, ఇషాన్ వికెట్ కీపర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆల్‌రౌండర్ల కోటాలో శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లకు అవకాశం లభించింది. స్పిన్ బాధ్యతలను వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ పంచుకోనున్నారు.

## బుమ్రా పునరాగమనం

పేస్ విభాగంలో స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రావడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అతడితో పాటు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా పేస్ బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే బుమ్రా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణాల ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి ఉంటుందని సెలక్షన్ కమిటీ తెలిపింది.

## సెప్టెంబర్ 13 నుంచి సమరం

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో 3 టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. యువ ఆటగాళ్లకు అవకాశమిస్తూ, అనుభవజ్ఞులను జోడించి ఎంపిక చేసిన భారత జట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో పోరుకు సిద్ధమవుతోంది. భారత జట్టు: శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా.




# నవంబర్ 27న మైసా విడుదల


## రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మునుపెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మునుపెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి. రష్మిక కథానాయిక. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసింది.



# మూడు సినిమాలతో మమిత బైజు హ్యాట్రిక్

'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు .. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది. ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్' విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది. సూర్య కథానాయకుడిగా విశ్వనాథ్ అండ్ సన్స్..: భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది. బెత్లెహోమ్ కుటుంబ యూనిట్..: నివిన్ పౌలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది. ఇప్పటికే రూ.200 కోట్ల మార్క్ దాటి రూ.250 కోట్ల దిశగా దూసుకుపోతోంది. దీన్నే తెలుగులో సెప్టెంబరు 4న విడుదల చేయనున్నారు.




# కరీనా కపూర్ క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ మరియు టాలెంటెడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూని కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా ప్రత్యర్థి పోలీసు అధికారులుగా కనిపించనున్నారు. చట్టం వర్సెస్ న్యాయం, నకిలీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయిన రామన్ కుమార్‌పై మరో పోలీసు అధికారి అజూని కోహ్లీ దర్యాప్తు చేసే తీవ్రమైన సన్నివేశాలతో ట్రైలర్ ఎంతో ఆసక్తికరంగా సాగింది. జంగ్లీ పిక్చర్స్, పెన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మేఘనా గుల్జార్ యదార్థ ఘటనల ఆధారిత సీరియస్ డ్రామాగా మలిచారు. సస్పెన్స్ మరియు హై-వోల్టేజ్ డ్రామాతో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న విడుదల కానుండగా, ప్రస్తుతం ఈ ట్రైలర్ సినీ వర్గాల్లో భారీ అంచనాలను పెంచేసింది.




# టాక్సిక్‌కు హాఫ్ స్టార్ రేటింగ్

### లెటర్ బాక్స్‌లో మహేశ్ బాబు తనయుడు గౌతమ్

### టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కుమారుడు గౌతమ్ ప్రముఖ సోషల్ మీడియా రేటింగ్ యాప్

లెటర్‌బాక్స్ ద్వారా ఇచ్చిన సినిమా రేటింగ్‌లు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. యశ్ హీరోగా నటించిన 'టాక్సిక్' సినిమాకు గౌతమ్ కేవలం హాఫ్ స్టార్ (0.5) ఇవ్వడం, అలాగే తన తండ్రి మహేష్ బాబు సినిమాలకే కాకుండా ఇతర స్టార్ హీరోల చిత్రాలకు ఇచ్చిన రేటింగ్‌లు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గౌతమ్ లెటర్‌బాక్స్ ప్రొఫైల్ ప్రకారం.. అతను ఇప్పటివరకు వివిధ భాషలు మరియు జోనర్లకు చెందిన 400లకు పైగా సినిమాలను వీక్షించినట్లు తెలుస్తోంది. అయితే ఇతరులతో సంబంధం లేకుండా, సినిమాల కంటెంట్‌ను బట్టి స్వతంత్రంగా రేటింగ్‌లు ఇవ్వడం ఈ డిబేట్‌కు ప్రధాన కారణమైంది. తన తండ్రి మహేష్ బాబు నటించిన కల్ట్ క్లాసిక్స్ 'పోకిరి', '1: నేనొక్కడినే' సినిమాలకు గౌతమ్ 5 నక్షత్రాల రేటింగ్ ఇవ్వగా, 'బ్రహ్మోత్సవం' చిత్రానికి కేవలం 1 స్టార్ మాత్రమే ఇచ్చాడు. అలాగే 'నిజం', 'వంశీ' చిత్రాలకు 2 చొప్పున రేటింగ్ ఇచ్చాడు. కేవలం టాలీవుడ్ మాత్రమే కాకుండా పాన్-ఇండియా, హాలీవుడ్ సినిమాలపై కూడా గౌతమ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. 'బాహుబలి 2' చిత్రానికి 5 స్టార్లు ఇవ్వగా, 'పెళ్లిచూపులు', 'సీతారామం' సినిమాలకు 4.5 రేటింగ్ ఇచ్చాడు. మరోవైపు, యశ్ 'టాక్సిక్' చిత్రంతో పాటు విజయ్ దేవరకొండ 'లైగర్' మూవీకి కూడా అర నక్షత్రం రేటింగ్ ఇవ్వడం విశేషం. ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి 2.5 రేటింగ్ ఇచ్చాడు. ఇక సినిమా కుటుంబానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, బంధుప్రీతికి తావు ఇవ్వకుండా సినిమాలోని కంటెంట్ ఆధారంగా నిజాయితీగా రేటింగ్‌లు ఇస్తున్నాడని కొందరు నెటిజన్లు గౌతమ్‌ను ప్రశంసిస్తుంటే, మరికొందరు సెలబ్రిటీ కుటుంబాల నుంచి ఇలాంటి బహిరంగ రేటింగ్‌లు రావడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సెలబ్రిటీల పిల్లలు అయినంత మాత్రాన వారి వ్యక్తిగత అభిప్రాయాలు, సినిమా రుచి ఇతరులలాగే ఉండటంలో తప్పులేదని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**